జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 31-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 688 పేజీలు: 4 వెల: రూ.7

## పలాస కంట్లో ..
# మట్టి!



- -మట్టి-కంకర మాఫియా ఇష్టారాజ్యం
- -కొండలు కొల్లగొట్టి కోట్ల దందా
- -రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల గర్జన.
- -టిప్పర్లతో మట్టి రవాణా
- -అధికారుల మౌనం
- -మర్మమేంటని ప్రశ్నిస్తున్న ప్రజానీకం

**(పలాస)**

అధికారుల అనుమతి లేకుండా ప్రకృతి వనరులను కొల్లగొడుతూ పలాసలో మట్టి-కంకర మాఫియా కోట్లు గడిస్తోంది. ఈ పలాస మండలంలో మట్టి, కంకర అక్రమ తవ్వకాల వ్యవహారం రోజురోజుకూ విస్తరిస్తోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి సంపదగా నిలిచిన కొండలను లక్ష్యంగా చేసుకుని కొందరు అక్రమార్కులు భారీ యంత్రాలతో తవ్వకాలు నిర్వహిస్తూ కోట్ల రూపాయల వ్యాపారానికి తెరలేపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పగటిపూట ప్రశాంతంగా కనిపించే ప్రాంతాలు రాత్రి పడగానే తవ్వకాల కేంద్రాలుగా మారిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఎక్స్‌కవేటర్లు గర్జిస్తుండగా పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టి, గ్రావెల్‌ను తరలిస్తూ కనిపిస్తున్నాయంటున్నారు. ఈ వ్యవహారం నెలల తరబడి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అడ్డుకట్ట లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మట్టి, కంకర మాఫియా పంజా..!

కొత్తవూరు నుంచి కోసంగిపురం వరకు మాఫియా కన్ను పడిందని, కొత్తవూరు, తర్లాకోట, కోసంగిపురం పరిసర ప్రాంతాలు ప్రస్తుతం మట్టి-కంకర మాఫియా కార్యకలాపాలకు కేంద్రాలుగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. కొండ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని భారీస్థాయిలో తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

కొండల గుండెలను కోసి మట్టిని, గ్రావెల్‌ను వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తున్నారని, ఈ వ్యవహారంలో కొందరు స్థానిక ప్రముఖులు కీలక పాత్ర పోషిస్తున్నారన్న ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతోంది.

### పట్టణ నడిబొడ్డునే భూ దందా..!

పలాసలోని మోర్ సమీప వెనుక ప్రాంతంలో సుమారు ఆరు ఎకరాల భూమిని మట్టితో నింపి ప్లాట్లుగా అభివృద్ధి చేసేందుకు భారీ ఒప్పందాలు కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భూమిని చదును చేయడానికి రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు నిరంతరం టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ప్రజలకు నిద్ర లేకుండా పోతోందని, రహదారులు దెబ్బతింటున్నాయని వారు చెబుతున్నారు.

### ఒక్క టిప్పర్ మట్టికే రూ.7 వేలు..!

స్థానికుల సమాచారం ప్రకారం ఒక్క టిప్పర్ మట్టిని సుమారు రూ.7వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. గ్రావెల్‌కు అయితే అంతకంటే ఎక్కువ ధర పలుకుతోందని చెబుతున్నారు.





ప్రతి రాత్రి పదుల సంఖ్యలో టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో రోజుకు లక్షల్లో, నెలకు కోట్ల రూపాయల మేర అక్రమ వ్యాపారం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ దందా వెనుక భారీ ఆర్థిక ప్రయోజనాలు దాగి ఉన్నాయని ప్రజలు అంటున్నారు.

### జగనన్న కాలనీ కొండలకూ ఎసరు..!

కోసంగిపురం జగనన్న కాలనీ సమీపంలోని కొండ ప్రాంతాల్లో కూడా భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ల అభివృద్ధి పేరుతో కొండలను కోసి గ్రావెల్‌ను తరలిస్తున్నారని చెబుతున్నారు. రోజురోజుకూ కొండల ఎత్తు తగ్గిపోతుండగా, ప్రకృతి సంపద కనుమరుగయ్యే ప్రమాదం నెలకొన్నట్లు పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కొండలపై మాఫియా దాడి..
### పర్యావరణానికి ముప్పు..!

అక్రమ తవ్వకాలతో కొండల సహజ ఆకృతి పూర్తిగా మారిపోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూసార నష్టం, వర్షపు నీటి ప్రవాహ మార్పులు, భూగర్భ జలాలపై ప్రభావం, పర్యావరణ అసమతుల్యత వంటి సమస్యలు భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చే అవకాశముందని అంటున్నారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన సమయంలో కొండలను నిర్వీర్యం చేయడం బాధాకరమని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

### ఎమ్మెల్యే నివాసానికి సమీపంలోనే అక్రమ రవాణా..?

పలాస ఎమ్మెల్యే నివాసానికి సమీప ప్రాంతాల్లోనే టిప్పర్ల ద్వారా మట్టి, గ్రావెల్ రవాణా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల కళ్ల ముందే భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మౌనంగా పోలీసులు..
### కనిపించని మైన్స్, రెవెన్యూ శాఖలు..!

అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన పోలీసు, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారుల తీరుపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. రాత్రివేళల్లో భారీ యంత్రాలు, టిప్పర్లు సంచరిస్తున్నప్పటికీ అధికారులకు సమాచారం లేకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ అక్రమ దందా నిరాటంకంగా కొనసాగుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ మట్టి, కంకర తవ్వకాలపై వెంటనే ఉక్కుపాదం మోపకపోతే పలాస పరిసర ప్రాంతాల్లోని కొండలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## మాకొద్దు బాబోయ్..
# విధ్వంసకర అభివృద్ధి

- కార్గో ఎయిర్‌పోర్టును వ్యతిరేకించిన భేతాళపురం గ్రామస్తులు
- కలెక్టర్‌కు తేల్చి చెప్పిన రైతులు







**మందస, మే 30(వార్త):** గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వమని భేతాళపురం గ్రామస్తులు, రైతులు తేల్చిచెప్పారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధ్వంసకర కార్గో ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేది స్పష్టం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని ముక్తకంఠంతో వారు నినదించారు. కలెక్టర్ ఈ గ్రామాన్ని సందర్శించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కలెక్టర్‌కు వారు స్వయంగా తమ అభ్యంతరాన్ని తెలియజేస్తూ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దని లేఖను అందజేశారు. కలెక్టర్ సమక్షంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేకపోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తమ జీవితాలను విధ్వంసం చేసే కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని చేపట్టకూడదని స్పష్టం చేశారు. మా పచ్చని ఉద్దానం భూములను ఏ ఇతర ప్రాంతం భూమితో పోల్చవద్దని మా భూమిపై కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి, బొప్పాయి, అరటి, మిరప, బెండ, వంకాయ, టమోటా లాంటి ఉద్యాన వన పంటలు పండిస్తూ.. తరతరాలుగా జీవిస్తున్నామన్నారు. ఈ పంటలకు ఫుడ్ ప్రాసె సింగ్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు నెలకొల్పాలని వారు కోరారు. దీనిపై ఆయన స్పందించి తప్పకుండా సబ్సిడీ లోన్స్‌తో పాటు ఇండస్ట్రియల్ పార్క్‌లో భూమి కూడా ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. మీరు దరఖాస్తులు పెడితే అన్ని అనుమతులను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కార్గో ఎయిర్‌పోర్ట్ బాధిత రైతులు మడియా పురుషోత్తం, బత్తిని దేశయ్య, బత్తిని ఉమాపతి, గార ఆనంద్, జుత్తు హేమరాజు, బొడ్డు శంకర్, కీలు ఖగపతి, దున్న సింహచలం, గార నారాయణ, బత్తిని పార్వ తి, కీలు గున్నమ్మ, జుత్తు పాపారావు, జుత్తు నారా యణ, జుత్తు అప్పలస్వామి తదితర రైతులు పాల్గొన్నారు.

## గంజాయితో..
# ఒడిస్సా యువకుడి అరెస్టు



**కంచిలి మే 30(వార్త):** ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి దూరప్రాంతాలకు తీసుకువెళ్లి అధిక రేట్లకు విక్రయించి ఆదాయం పొందాలన్న దురాశతో సోంపేట రైల్వే స్టేషన్లో రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా ఒడిశాకు చెందిన యువకుడుని కంచిలి ఎస్సై పారినాయుడు శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. ఆయన నుంచి గంజాయి పొట్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సోంపేట సీఐ బి.మంగరాజు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం జార్సుగూడ జిల్లా గుమాదర గ్రామానికి చెందిన 24 ఏళ్ల వయస్సు గల అభినవ్ సింగ్ సోంపేట రైల్వేస్టేషన్లో శనివారం ప్రశాంతి ఎక్స్ప్రెస్ ఎక్కేందుకు వచ్చి.. పార్కులో తిరుగుతుండగా అనుమానంతో కంచిలి ఎస్ఐ పారినాయుడు.. ఆయనను పరిశీలించగా.. బ్యాగ్‌తో గంజాయి దొరికిందని వెల్లడించారు. ఈ గంజాయి బరువు మూడు కిలోల 370 గ్రాములు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ గంజాయిని ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా సోమంతపూర్ గ్రామానికి చెందిన సుమన్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. సుమన్‌ను ఈ కేసులో ఏ2 గా చేర్చినట్లు తెలిపారు. అభినవ్ సింగును కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా గంజాయి పట్టుకున్న ఎస్సై పారినాయుడు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ గల యువకులు వ్యసనాలకు గురై ఎటువంటి నేరపూరిత పనుల్లో ఇరుక్కుపోతున్నారని, ఈ విషయంలో తల్లి దండ్రులు జాగ్రత్తగా గమనించి పిల్లలను తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

## చింతామణి అమ్మవారిని దర్శించిన వైసీపీ నేతలు

**కవిటి, మే 30(వార్త):** కవిటిలో జరుగుతున్న చింతామణి అమ్మవారి సంబరం మహోత్సవాలలో భాగంగా శనివారం వైసీపీ నేతలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కమిటీ వైసీపీ నేతలను సాదరంగా ఆహ్వానించి శేష వస్త్రాలను అలాగే అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, నేతలు తడక జోగారావు, చల్ల దేవరాజు, నర్తు ప్రేమ్‌కుమార్, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ కమిషన్ దృష్టికి ..
## మందస ఎస్సీల భూసమస్యలు



**మందస, మే 30(వార్త):** స్టేట్ ఎస్.సి.కమీషన్ మెంబర్ రావాడ సీతారాంనకు మందస మండలం లోని దళితులు భూ సమస్యలను షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నాయకులు వివరించారు. ఈ మేరకు వారు దళితులు వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. ముందుగా ఆయనను మందస తహసీల్దార్ కార్యాలయంలో కలసి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. అనంతరం కొంకడాపుట్టిలోని దళిత మహిళా ఉరజాన లక్ష్మి జిరాయతు భూమిని గౌడ కులస్తులకు సంబంధించిన వ్యక్తులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించారని పిర్యాదు చేసింది. దీనిపై స్థానిక ఆర్డీవో, తహసీల్దార్ కు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ, ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 2003సంవత్సరంలో లోహరిబంద గ్రామం సమీపంలో దళితులకు సోషల్ వెల్ఫేర్ ల్యాండ్ సుమారు రెండు ఎకరాల నలభై సెంట్లులో 42ఇండ్ల పట్టాలు, మినీ అంగన్ వాడీ భవనం, ఆటస్థలం నిర్మాణం కోసం కేటాయించారన్నారు. కానీ ప్రస్తుతం ఇతర కులాల పెత్తనం వలన ఈ భూమిని కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఎస్.సి.కమిషన్ కు కలసిన వారిలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి మోహనరావు, కార్యదర్శి ఇప్పిలి చంద్రశేఖర్, మందస మాజీ సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, నగరి నరసింహమూర్తి, పిలక శ్రీనివాసరావు, లోహరిబంద, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తిలారు ఫ్లైఓవర్‌పై ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాపులు

**- ప్రయాణికుల సమస్యపై స్పందించిన అధికారులు**

**- వంతెనకిరువైపులా షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు**

**జలుమూరు, మే 30(వార్త):** జలుమూరు మండలం తిలారు ఫ్లైఓవర్ వంతెన వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ల ఏర్పాటు చేయనున్నట్లు శ్రీకాకుళం డిపో మేనేజర్ శాస్త్రి తెలిపారు. ఈ మేరకు వంతెనకు ఇరువైపులా ప్రయాణికుల కోసం షెల్టర్లు కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. తిలారు గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రావిపాడు ఎంపీటీసీ ప్రతినిధి రామకృష్ణ ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లైఓవర్ నిర్మాణం అనంతరం బస్సులు నిలవకపోవడంతో తిలారులోకి వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. ప్రత్యేకించి వృద్ధులు, విద్యార్థులు, మహిళలు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. సమస్యపై స్పందించిన అధికారులు పరిస్థితిని పరిశీలించి ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్‌కు ఇరువైపులా రిక్వెస్ట్ స్టాప్లు, ప్రయాణికుల షెల్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రిక్వెస్ట్ స్టాప్లు అందుబాటులోకి వస్తే తిలారు గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తగ్గనున్నాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.



## కేటీ రోడ్డు ఆక్రమణలపై అధికారుల కొరడా



**పలాస, మే (30 వార్త):** పలాస కేటీ రోడ్డుపైన ఆక్రమణలు తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. రహదారి ఆక్రమణలపై అధికారులు కొరడా ఝులిపించారు. మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, పట్టణ సీఐ వై.రామకృష్ణ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేసిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ఆక్రమణలు చేస్తే భారీగా జరీమన విధిస్తామని హెచ్చరించారు. రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకానికి దారి చూపిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌లు కేవలం పాదచారుల కోసమే ఏర్పాటు చేశామని, వ్యాపార సంస్థలు తమ సామగ్రిని రోడ్డు పక్కన ఫుట్‌పాత్ మీద పెట్టవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయరాదని, ప్రజలు నడిచేందుకు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. వాటిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని" స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావతమైతే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అధికారులు హర్ష, ప్రేమ్‌చంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులూ..బహుపరాక్!



**పలాస, మే 30 (వార్త):** పలాస మండలం కొబ్బరి వూరు సమీప 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద గత రెండు రోజుల్లో రెండు వాహన ప్రమాదాలు చోటుచేసుకోడం గమనార్హం. శుక్రవారం ఉదయం సోంపేటకు చెందిన ఓద్విచక్రవాహణదారుడు రోడ్డు ప్రమాదానికి గురి కాగా, శనివారం అదే ప్రదేశంలో, సోంపేటకు చెందిన తల్లి కొడుకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఓ శునకాన్ని ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న పలాస 108 సిబ్బంది సత్యం, వెంకట్రావులు ప్రధమ చికిత్స అందించి పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయరహదారికి సర్వీస్ రోడ్డు లేని కారణంగానే నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతుండగా, వాహనదారులు మాత్రం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

## రూ.కోటితో 32 సాగునీటి కాలువలకు మరమ్మతులు



**మందస, మే 30(వార్త):** మందస మండలంలోని 32సాగునీటి కాలువల మరమ్మతులకు కోటి రూపాయలు మంజూరయ్యాయని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. మందస మండలంలోని బాలిగాం గ్రామం వద్ద మురిపిండి చెరువు నుంచి సంతబంద చెరువు వరకు కాలువలో పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బావన దుర్యోధన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ఉద్యమ స్ఫూర్తితో, తండ్రి గౌతు శ్యామసుందర శివాజీ గారి ఆశయ సాధనతో.. ప్రజాసేవే పరమావధిగా నిరంతరం ప్రజల పక్షపాతిగా పలాస నియోజకవర్గ అభివృద్ధి కోసం, నిరంతరం ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష సంకల్పంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రతీ చేనుకు నీరు-ప్రతి చేతికి పని అనే నినాదంతో, రైతు ఆనందమే లోకానందమని మందస మండలంలో సుమారు 32 సాగునీటి కాలువలు పూడికలు తీయుటకు కోటి రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా బాలిగాం గ్రామ మురిపిండి చెరువు నుంచి సంతబంద చెరువు వరకు కాలువలో పూడికతీత పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. నిరంతరం ప్రజల క్షేమం కోసం కృషి చేస్తున్న శాసనసభ్యురాలు గౌతు శిరీష బాలిగాం గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు పంచాయతీ ప్రజల అందరి తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## విపత్కర పరిస్థితుల్లో 'శక్తి యాప్' రక్షణ కవచం

**- ఉపాధి హామీ కార్మికులకు పోలీసుల అవగాహన**

**- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**




**పోలాకి, మే 30(వార్త):** విపత్కర పరిస్థితుల్లో తక్షణ పోలీసు సహాయం పొందాలంటే ప్రతి ఒక్కరి స్మార్ట్ మొబైల్‌లో 'శక్తి యాప్' తప్పనిసరిగా ఉండాలని టెక్కలి డివిజన్-4 పోలీసు సిబ్బంది సూచించారు. శనివారం పోలాకి మండలం నరసాపురం గ్రామంలోని చిట్టమ్మకోనేరు వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ, మహిళలు, వృద్ధులు మరియు సాధారణ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా వెంటనే పోలీసులను సంప్రదించవచ్చని వివరించారు. యాప్‌లో ఉన్న అత్యవసర అలర్ట్ వ్యవస్థ ద్వారా తక్షణ సహాయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అలాగే ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మోసాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. చట్టాలపై ప్రజలకు కనీస అవగాహన ఉండాలని, ఏదైనా అనుమానాస్పద ఘటన ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో భద్రతా అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, మహిళా పోలీసు కానిస్టేబుల్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## కొత్తకర్ర చెరువు గట్టుపై చెత్త తొలగింపు వేగవంతం

**-మీడియా కథనాలకు స్పందించిన జిల్లా కలెక్టర్**

**- 200 ట్రాక్టర్లతో డంపింగ్ యార్డుకు తరలింపు**

**నరసన్నపేట, మే 30 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని కొత్తకర్ర చెరువు గట్టుపై పేరుకుపోయిన చెత్తను గ్రామపంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. ఇటీవల రోజువారీ వార్తాపత్రికలు మరియు సోషల్ మీడియాలో చెరువు పరిస్థితిపై కథనాలు ప్రచురితమవడంతో జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నుంచి ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. చెరువు గట్టుపై పేరుకుపోయిన భారీ స్థాయి చెత్తను సుమారు 200 ట్రాక్టర్ల సహాయంతో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్త తొలగింపు పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా కొనసాగిస్తున్నారు. చెరువు గట్టు ప్రాంతంలో చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెత్త తొలగింపు చేపట్టడం వల్ల మురుగు నీటి నిల్వలు, దోమల సమస్య తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా పట్టణంలో పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. చెరువులు, కాలువల వద్ద చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, మీడియా కథనాలకు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్‌తో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలను శాశ్వతంగా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు కొనసాగించాలని కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వైశ్య కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

**నరసన్నపేట, మే 30(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద వైశ్య కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని వైశ్య సంఘ నాయకులు అభినందించారు. ఇప్పటివరకు సుమారు 30 వైశ్య కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. తాజాగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటిన సంతు తండ్రికి, కింతల ప్రదీప్ తండ్రికి కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గణనీయమైన ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యాపార రంగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక నిరుపేద వైశ్య కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా మారిందని స్థానికులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వైశ్య జాతి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే పేద కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం అందిస్తోందని నాయకులు పేర్కొన్నారు.





# ఆక్రమణల చెరలో పాలకర్ర చెరువు

**- కనుమరుగవుతున్న చెరువును పరిరక్షించాలని స్థానికుల విజ్ఞప్తి**

**- అధికారులు వెంటనే స్పందించాలని ప్రజల డిమాండ్**

**నరసన్నపేట, మే 30 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో మరో చెరువు ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాలకర్ర చెరువు రోజురోజుకూ ఆక్రమణల కారణంగా తన అసలు రూపాన్ని కోల్పోతుందని పేర్కొంటున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, 178 సర్వే నంబరులో సుమారు 5 ఎకరాల 45 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ప్రస్తుతం ఒక ఎకరం విస్తీర్ణం కూడా కనిపించని పరిస్థితికి చేరిందని ఆరోపిస్తున్నారు. చెరువు పరిధిలో క్రమంగా ఆక్రమణలు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చెరువులు భూగర్భ జలాల పరిరక్షణకు, వర్షపు నీటి నిల్వకు కీలకమని, ఇలాంటి సహజ వనరులు కనుమరుగైతే భవిష్యత్తులో నీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పట్టణ విస్తరణ పేరుతో చెరువుల ఆక్రమణలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాలకర్ర చెరువు చుట్టూ స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువు భూములను పరిరక్షించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువును శుభ్రపరిచి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్ తరాలకు సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానికులు పేర్కొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే

# కేసులు తప్పవు

**-రాంగ్‌రూట్ ప్రయాణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్న ఎస్ఐ గణేష్**

**- నరసన్నపేట ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు**

**నరసన్నపేట, మే 30 (వార్త):** మోటార్ వాహన చట్టం ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేయడం తప్పదని ఎస్సై గణేష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి నరసన్నపేట ప్రధాన రహదారిలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నరసన్నపేట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం, సరైన మార్గంలో ప్రయాణించడం, అతివేగం నివారించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ తరచూ వాహన తనిఖీలు నిర్వహిస్తుందని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కోరారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





### మాదకద్రవ్యాల సమాచారాన్ని

# పోలీసులకు అందించాలి

**- యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచన**

**- పచోరి కాలనీ వాసులకు అవగాహన కల్పించిన పోలీసులు**

**నరసన్నపేట, మే 30(వార్త):** మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 హెల్ప్‌లైన్‌కు గాని, సమీప పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం అందించాలని సీఐ శ్రీనివాసరావు, నరసన్నపేట మరియు సారవకోట ఎస్సైలు గణేష్, అనిల్ కుమార్ ప్రజలను కోరారు. శనివారం నరసన్నపేట పచోరి కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని స్థానిక ప్రజలకు గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే స్పందించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. సమాజాన్ని మత్తు పదార్థాల బారినుంచి కాపాడేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పోలీసులు పేర్కొన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ‘కబడ్డీతో కదం తొక్కిన యువతరం’

**పలాస, మే 30 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామంలో యువ చైతన్య ఆర్ట్స్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ, ‘కబడ్డీ ఆడితేనే కాదు, చూసినా క్రీడా స్ఫూర్తి ఉప్పొంగుతుంది. యువతరం క్రీడా స్ఫూర్తితో ముందుకు రావడం అభ్యుదయవాదానికి నిదర్శనం’ అని అన్నారు. రాజాం గ్రామం ఐక్యమత్యానికి మారుపేరుగా నిలిచిందని, యువకులలో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు సామాజిక స్పృహను పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. శారీరకంగా, మానసికంగా యువకులు దృఢంగా ఉండడానికి ఈ గ్రామీణ ఆటల పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. “నేటి యువతలో సామాజిక సేవ పట్ల మక్కువ పెరగాలి. గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, బృంద స్ఫూర్తి కబడ్డీ నేర్పుతుంది. సమాజ సేవలో యువత విరివిగా పాల్గొనడానికి క్రీడలు ఒక మంచి మార్గం. ఓడిన జట్టును కూడా భుజం తట్టి అభినందించే సంస్కారం మైదానంలోనే నేర్చుకుంటాం” అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రాజాం గ్రామ యువకులకు, పెద్దలకు, రాజకీయ నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాజాం గ్రామం యువ చైతన్య ఆర్ట్స్ యువజన సేవా సంఘం 25 వ వార్షికోత్సవాలు పూర్తిచేసుకుని అభ్యుదయ భావాలతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి యువతకు మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలతో ఈ సంఘం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుంచి పలు కబడ్డీ జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్ట గీత జోగారావు దంపతులు, ఎక్స్ సర్పంచ్ పోతనపల్లి సాంబశివరావు, యువ చైతన్య ఆర్ట్స్ ప్రెసిడెంట్ కుర్రాయి రామారావు, ఎక్స్ ఎంపీటీసీ మరడ భాస్కర్ రెడ్డి, పెద్దలు వల్లభ వైకుంఠ రావు, బల్ల రాంబాబు, పైడి ప్రభాకర్ రావు, నౌగాపు రాజారావు, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**-పచోర కాలనీలో తెల్లవారుజామున విస్తృత తనిఖీలు**

**- పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**నరసన్నపేట, మే 30 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని పచోర కాలనీ ప్రాంతంలో శనివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎం. శ్రీనివాసరావు నేతృత్వంలో సారవకోట ఎస్సై అనిల్, నరసన్నపేట పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్డెన్ సెర్చ్‌లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు ప్రాంతంలో నివసిస్తున్న వారి గుర్తింపు వివరాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలు కలిగి ఉండాలని, చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ప్రజలు అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు ఇలాంటి తనిఖీలు తరచూ కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు. స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



### మహానాడులో జగన్ నామస్మరణ తప్ప ..

# రాష్ట్ర అభివృద్ధిపై తీర్మానాలేవీ?

**-డబ్బాలు కొట్టుకున్నారే తప్ప ప్రజా డబ్బుకు లెక్క చెప్పలేదు’**

**-రెండు రోజుల మహానాడులో సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగాలపై ఒక్క తీర్మానం లేదు**

**-వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**

**పలాస, మే 30 (వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు కోట్లు ఖర్చు పెట్టి ఆర్భాటంగా నిర్వహించిన టీడీపీ మహానాడులో రాష్ట్ర అభివృద్ధిపై, ప్రజా సంక్షేమంపై ఒక్క తీర్మానం కూడా లేకపోవడం దురదృష్టకరమని, ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్రంగా విమర్శించారు. శనివారం పలాసలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘మహానాడు అంటే రాష్ట్ర భవిష్యత్తుపై మేధోమథనం జరగాలి. నాలుగు కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు దిక్సూచిగా నిలవాలి. కానీ టీడీపీ మహానాడు అంతా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నామస్మరణే సరిపోయింది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు జగన్ జపమే తప్ప రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కౌలు రైతుల ఆత్మహత్యలు, విద్యుత్ ఛార్జీల భారం, కరెంట్ కోతలు, ఆరోగ్యశ్రీ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఒక్క చర్చా లేదు. సొంత డబ్బా, పర డబ్బా, పరస్పర డబ్బా కొట్టుకోవడమే సరిపోయింది. ప్రజా ధనంతో జల్సా చేసిన వాళ్లు ప్రజా డబ్బుకు లెక్క చెప్పలేదు’ అని ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నికల సందర్భంగా ‘సూపర్ సిక్స్’ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు, జగన్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను సైతం నిలిపివేసి అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని దుర్యోధనరావు దుయ్యబట్టారు. “రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో వర్చువల్ విధానంలో, ఎల్‌ఈడీ తెరలతో హంగామా చేసి నిర్వహించిన మహానాడు వల్ల సామాన్యుడికి, పేదవాడికి ఒరిగిందేమీ లేదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న ‘ఆడబిడ్డ నిధి’ హామీ ఏమైంది? 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపిల్లకు నెలకు రూ.1500 ఎక్కడ? 60 ఏళ్లు దాటి రెండేళ్లయినా కొత్త పింఛన్లు ఎందుకు ఇవ్వలేదు? యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి రూ.3000 ఎక్కడ? రైతులకు రూ.20 వేల రైతు భరోసా ఎక్కడ? ఉచిత బస్సు ప్రయాణం ఎక్కడ? అన్న క్యాంటీన్లు ఎక్కడ?” అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపలేకపోయారని, ‘వెల్త్ క్రియేషన్’ పేరుతో సంపద ఎవరికి సృష్టించారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. “అప్పులు తెచ్చి అప్పుల్లో ముంచారు తప్ప రాష్ట్రానికి తెచ్చింది ఏమీ లేదు. అమరావతి బ్రాండ్ ఇమేజ్ అన్నారు, పోలవరం పూర్తి చేస్తామన్నారు. రెండేళ్లయినా ఒక్క ఇటుక కూడా వేయలేదు. రివర్స్ టెండరింగ్ అని గగ్గోలు పెట్టి ప్రాజెక్టులను ఆపేశారు. ఇప్పుడు అవే పనులకు రెట్టింపు అంచనాలతో టెండర్లు పిలుస్తున్నారు. ఇదేనా మీరు చెప్పే పారదర్శకత?” అని నిలదీశారు. కొత్త కంపెనీలు రాష్ట్రానికి ఎందుకు రావడం లేదో, ఉన్న పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు ఎందుకు తరలిపోతున్నాయో, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై మీ వైఖరి ఏమిటో, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఎందుకు నోరు మెదపలేదో మహానాడులో చర్చించాల్సింది పోయి, వ్యక్తిగత దూషణలకు, కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం – ఏ రంగంలోనైనా రాష్ట్ర అభివృద్ధికి ఒక రోడ్ మ్యాప్ ప్రకటించారా? లేదు. ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము, ధైర్యం టీడీపీ నాయకత్వానికి లేదు. అందుకే జగన్ పేరు చెప్పుకుని రెండు రోజులు కాలక్షేపం చేశారు. వైఎస్ జగన్‌ను విమర్శించడమే మహానాడు ఏకైక ఎజెండా అయింది. ఇది ప్రజలను మభ్యపెట్టడమే తప్ప మరొకటి కాదు” అని బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు.






Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546